

# పిండొాడిం

విశాఖపట్నంలో మెయిలు ఎక్కి పలాస స్టేషన్‌లో దిగానం, నాతో పాటు మా అన్నయ్యగారి పాప, బాబు ఇద్దరూ వున్నారు. చిన్న దాన్ని ఎత్తుకున్నాను. బాబు నా చెయ్యి పట్టుకొని నడుస్తున్నాడు. స్టేషన్ దాటాలని బ్రిడ్జీ మెట్లు ఎక్కుతున్నాను...

''అయ్యా....'' చాలా ఆప్యాయంగా పిలుపు వినిపించింది.

వెనుదిరిగి చూసాను.

'పిండొాడిం!'

అయిదడుగులు ఎత్తున్నా గూని వలన మరో అడుగు తక్కువగానే కనిపించేడు. అదే ఖాకీ నిక్కరు. అదే ఎర్రచొక్కా వీపు మీద. పల్చటి జుట్టు.

నెత్తిమీది సూట్‌కేసు, చేతిలోని బేగులను దించి పరుగున మా దగ్గరకు వచ్చాడు. 'బాగున్నావా అయ్యా? మొన్నే నాన్నని అడిగాను... నడిపోడు రాలేదాని? రెండ్రోజులు వుంతావా అయ్యా?... అన్న పిల్లలు కదయ్యా' అంటూనే నా చేతిలోని బేగుని, పాపని అందుకున్నాడు. పాపని మెడమీద కూర్చోపెట్టుకున్నాడు.

'పిండొాడిం' లో మార్పురాలేదు!

అదే ఆప్యాయత... అదే వాత్సల్యం... అదే మాట తీరు....

మనిషి మాత్రం పీనుగులా వున్నాడు. గతసారి అంటే నాలుగు నెలల క్రితం వచ్చినప్పటి కంటే చాలా చిక్కిపోయాడు. కళ్లు లోతుగా, అలసిపోయినట్టున్నాడు.

పిండొాడిం లగేజి దించేసిన చోట నిలబడి కోపంతో దగ్గరికి వచ్చిన మనిషి 'ఏమిటయ్య లగేజి మధ్యలో దించేసి...' అడగబోయాడు. అంత కంటే ముందు పిండొాడిం... ''ఒరే నారిగ, ఈ బాబు లగేజట్టి కెళ్లరా... నాకు పనుంది...'' నారిగాడికి పని పురమాయించి మా వెంట బయలుదేరాడు.

''గొప్పవాడివే...'' లగేజి గల ఆయన గొణుక్కుంటూ నారిగాడి వెంట వెళ్లాడు.

''పిండొాడిం,ఫరవాలేదులే ... నువ్వెళ్లు. లగేజి ఏం లేదు కదా...'' అన్నాను.

''పాప వున్నది కదా ఎత్తుకుంతాను... గుమ్మడిపండు కదమ్మా...'' నా మాట

పట్టించుకోకుండా పాపకళ్ళలోకి చూస్తూ అడిగి మరీ నడుస్తున్నాడు.

స్టేషన్ మాస్టర్, బుకింగ్ క్లర్కు, మరో ఇద్దరు ముగ్గురు బ్రిడ్జీ మీదే కనిపించి పలుకరించారు. బ్రిడ్జీ దిగి క్వార్టర్స్‌లోకి వెళ్తుంటే పాప ఎందుకనో ఏడ్చింది. పిండొడిం లాలించబోయాడు. పాప నాదగ్గరికి వచ్చేసింది. బాబురూప్ తనకీ గుర్రం పండు వేయమన్నాడు. నేను వద్దన్నాను. వాడు విన్లేదు. పిండొడిం కష్టం మీద ఈసారి బాబుని ఎత్తుకున్నాడు. రెండడుగులు తూలినా బలంగా అడుగు వేస్తున్నాడు. బలం లేకపోయినా అలవాటుకి 'సత్తువ' వున్నట్లనిపించింది.

క్వార్టరు చేరుకున్నాం.

పిండొడిమే అమ్మకీ, అవతలి లైనుకీ వినిపించేలా కేకవేసి మరీ మా రాకను చెప్పాడు. గేటు తీసాడు. గుర్రం పండు దించాడు. బేగులు లోపల పెట్టాడు. పాపని అమ్మకి అందించాడు.

నాకెందుకో పిండొడింని చూస్తుంటే చనిపోయిన మా తాతయ్య గుర్తుకు వచ్చాడు. అమ్మ నాతో మాట్లాడుతుంటే పిండొడిం ఆగలేదు. ఉద్యోగ మయ్యిందా? అడిగాడు. ఉద్యోగం రాలేదని తెలిసి గవర్నమెంటుని, తనకి తెలిసిన మంత్రుల్ని పేరుపెట్టి తిట్టాడు. ఉద్యోగం వస్తుందన్నాడు. నాకు ఉద్యోగం రాకపోతే ప్రపంచంలోనే ఉద్యోగం ఎవరికీ రాదన్నాడు.

మేం ఇంట్లోకి వచ్చి కూర్చుంటే పిండొడిం గడపలోనే నిలబడ్డాడు. లోపలకి రమ్మని నేను అన్నాను. 'పరవాలేదు, పనుంది. ఎళ్ళిపోతా' నన్నాడు. జేబులోంచి ఐదు రూపాయలు తీసి ఇచ్చాను. చిల్లర లేదన్నాడు. 'పరవాలేదు వుంచుకో' అన్నాను. వద్దన్నాడు. అమ్మ కేకవేసి, చనువుగా కళ్ళెర్ర జేస్తే అప్పుడు జేబులో పెట్టుకున్నాడు. వెళ్తానన్నాడే గాని అరగంట దాక అక్కడ వుండిగాని కదల్లేక పోయాడు.

ఆ రాత్రి ఎందుకనో కళ్ళ నిండా పిండొడిమే కనపడ్డాడు.

పిండొడిం ఆలోచనలే నా చుట్టూరా తిరిగాయి.

రెండు నెలలకీ, మూడు నెలలకీ సొంతవూరు వచ్చినపుడల్లా పిండొడింని చూస్తూనే వున్నాను. అలా ఓపది, పదేహేనుళ్ళుగ పిండొడిం తెలుసు. ఊహ తెలిసాక పిండొడిం తెలుసు. అంతకు ముందూ తెలుసు, అమ్మనాన్నలకు తెలుసు. సరిగా నాన్నగారి వయసుండొచ్చు. అంతకన్నా ఎక్కువే వుంటుందేమో... లేకపోతే అలా కనిపిస్తాడా?

తలుపు చప్పుడయింది.

అమ్మ వెళ్లి తలుపు తీసింది. నాన్న వచ్చినట్టున్నారు. ఫస్టు నైట్ డ్యూటీ అయిపోయిందన్న మాట. టైమ్ రాత్రి పన్నెండున్నర అవ్వొచ్చు!

నాన్న వచ్చాక ఇంట్లో లైటు వేశారు. నన్ను చూస్తూనే ''వీడెప్పుడొచ్చాడు?'' అడిగారు. అమ్మ చెప్పింది. నేను కళ్లు మూసుకున్నా మెలకువగానే వున్నాను.

నాన్న బట్టలు మార్చుకోకుండా అలానే కూర్చున్నారు. ఏమలా వున్నారని అమ్మ అడిగింది. నాన్న రెండు క్షణాలు నిట్టూర్చి ఊపిరి వదులుతూ చెప్పారు.

''పిండొడిం మూటలు మోస్తూ కళ్లు తిరిగి పడిపోయాడు. తలకి దెబ్బకూడా తగిలింది. నాలుగు కుట్లు వేశారు.''...

'' ఇప్పుడెలా వుంది?'' అమ్మ అడిగింది.

'' ఆ కుట్లు కలిసేంత వరకూ మూటలు మొయ్యకూడదు. డాక్టరు చెప్పిన మాటలే. మేమంతా పోరాం, వాడు వింటాడని నమ్మకం లేదు. ఆలనా పాలనా చూసే ఆడదిక్కు లేదు. ఆ అత్తముండ ఇంత జరిగినా తొంగి చూడలే. వాడి పెళ్లామే బ్రతికుంటే ఇలా జరక్కపోను...'' నాన్న అన్నారు.

''అదీ వీడి వల్లే చచ్చిందని నిందమోపారు. ఆ పిల్లడు రేపో మాపో లాగ వున్నాడు.. ఏమిటో ఒక్కో జన్మ ఎంత తెచ్చుకుంటుందో...'' అమ్మ నిట్టూర్చింది.

పిండొడిం గురించి ఆసమయంలో అమ్మని ఏదో అడగాలనిపించింది. కాని లైటారిపోయి వుంది. చాలా సేపటికి గాని నిద్ర పట్టలేదు. మెలకువ వచ్చి చూస్తే పొద్దెక్కి వుంది.

పెరట్లో అమ్మ ఊరుబిండి (తెలుకపిండి)తో పిండొడియాలు (పిండి వడియాలు) పళ్లెరంలో పెడుతోంది.

'' ఏ మిటమ్మా తెల్లవారే సరికి?.. ఈ పనులన్నీ చాలవా?...'' అడిగాను.

''నీ కిష్టమనిరా! నీకు చల్దన్నం అలవాటు, తెల్లవారే సరికి ఏమి కూరవుంటుంది? అందుకు వడియాలు పెడుతున్నాను. అందులోనూ నీకు పిండొడిమంటే ప్రాణం...'' అమ్మ చెప్తోంది. కాని నాకు పిండొడిం అనగానే ముసలి 'పిండొడిం' గుర్తుకు వచ్చాడు.

''అమ్మా పిండొడింకి ఎలా వుంది?'' అడిగాను.

అమ్మ రాత్రి నే పడుకోలేదని గ్రహించింది. నాన్న చెప్పిన విషయాలే అమ్మ మళ్ళీ చెప్పింది. నాన్న అక్కడికే వెళ్లారని అంది.

'పిండొడిం' పేరేమిటి? అమ్మ నడిగాను.

అమ్మ గతాన్ని నా ముందుంచింది. అప్పుడెప్పుడో చిన్నప్పుడట, నాన్న, పిండొడిం అంతా ఒక తోటి గుంటలట. వీళ్ళందరి ఇళ్ళూ ఒక వాసలో వుండేవట. ఓసారి కొండివీధిలో మంటలేచి మన వాసా అంటుకుందట. మంట ఊరు చుడుతుంటే కుర్రాళ్లంతా దాన్ని ఆర్పడానికెళ్ళారట.

ముసలాళ్ళు చిన్న పిల్లల్ని తమతో తీసుకెళ్లారట. ఆడాళ్ళంతా సామాన్లు పెరకటం చేశారట. అదిగో అప్పుడు పారమ్మ డబ్బాల్ని, డొక్కుల్ని (అదే దాని సంసారం) తెస్తోందట... ఓ డబ్బా చేజారి కిందపడి, మూతపడి పిండి వడియాలు వలికి పోయాయట... అదిగో అప్పుడు 'పిండొడిం' తనకి 'పిండొడిం' ఇమ్మని ఒకటే ఏడుపట. అందరూ ఆస్తులు పోయి, బూడిదయి ఏడుస్తుంటే పిండొడిం పిండొడియాల

కోసం ఏడ్చాడట, జ్వరం కూడా పెట్టుకున్నాడట. ఎవరో చేతిలో పిండొడిం పెడితే 'పిండొడిం' లేచి కూర్చున్నాడట. మంత్రించినట్టుగా జ్వరం పోయిందట... అందరూ ' ఓరి పిండొడిమూ... పిండొడిమూ' అని ఎగతాళి చేసి చేసి అదే వాడి పేరయిపోయింది!

'అసలు పేరు మీ నాన్నకే తెలీదు'.

''అమ్మా పిండొడింకి ఉద్యోగం రాలేదామ్మా...?''

''పిండొడింకి తండ్రితో పాటు బక్కలు కాయడం, తల్లితో పాటు కూలికెళ్లడంతోనే సరి. కడుపు జరక్క పనిలోకే గాని బడిలోకి పంపలేదు. పిండొడిం పుట్టుకూలీ అయిపోయాడు.. నిత్యమూ పనులేటి దొరుకుతాయి? అందుకే రైల్వేలో లైసునీసు కూలీ అయ్యాడు. ఇన్నాళ్ల సర్వీసుకి గేంగ్ వేనే అవాలి, గాని వీడెళ్తే సొంత పనుల్తొంగుంటాయని స్టేషన్ మేస్టర్ల నుండి ఎవ్వరూ ఎల్లనివ్వలేదు.... కానివ్వలేదు''

అమ్మ మాటలాపి మధ్యలో టీ తెచ్చి ఇచ్చింది.

మళ్లీ చెప్పింది...

''మీ నాన్నకు కూ్డా చదువుకొనే దారి లేకపోయినా, ప్రయివేట్లు కెళ్లి ఎనిమిది పాసయినారు. అప్పుడు మీలాగ కాదు... పద్దెనిమిదేళ్లకే పని! పది చదివి వుంటే చాలు. ఉద్యోగం చిన్దో పెద్దదో దొరికేది. మొదాట మీ నాన్నకి గార్డుబోయి వుజ్జోగం వచ్చింది. అంటే గార్డు పెట్టెలు మొయ్యడం. ఆ వుజ్జోగం మీ నాన్న చెయ్యలేక పోతే పిండొడిమే పెట్టెలు మోసేవాడు. అప్పుడు పొట్టిగా లావుగా గుమ్మడి పండులాగా వుండే వాడులే, అయితే పావలో... అర్థో మీనాన్న వాడికి జీతమిచ్చుకునేవారు. వాడికదే కొండంత సంబరమయిపోయి 'అన్న ... అన్న...' అని మీ నాన్నని ఇప్పటికీ వదలడు.

''తరువాత మీ నాన్నకు ప్రమోషనొచ్చింది. గార్డుబోయి నుండి టి పి ఎం ఎ. తరువాత టి పి ఎం బి తరువాత.. ఇదిగో ఇప్పుడు స్విచ్చుమేనే. మీ నాన్నకి పెద్ద చదువులేక గాని మీ నాన్న తోటోళ్ళు ఏయెస్సెమ్ములు, ఎస్సెమ్ములూ గార్డులయిపోయి అంతలేసి జీతాలు తెచ్చుకుంటున్నారు. వాళ్లందరికీ కూడా ఈ పిండొడివే సాయపడేవాడు. అంత మంది డ్యూటీ వాడే చేసేవాడు'', అమ్మ చెపుతూనే వుంది.

నేను ఏదో ఆలోచనల వల్ల వెనకబడిపోయాను. అందరి ఉద్యోగాలు చేసి తనకో ఉద్యోగం లేని పిండొడింని చూస్తుంటే బాధనిపించింది. అంతకు మించి మా రక్తంలో వాడి చెమట బొట్టులు ఇమిడివున్నట్టనిపించింది. మా కుటుంబమే కాక అనేక కుటుంబాలు పిండొడింకి రుణపడి వున్నట్టనిపించింది.

ఇంతలో నీలమ్మ పిల్లాడ్ని ఎత్తుకొని వచ్చింది. తపేలా చూపించి గెంజి పొయ్యిమంది. గెంజి, పసగడుగు (బియ్యం కడిగిన నీళ్ళు), మినప పొట్టు అందులో వేసింది అమ్మ.

నీలమ్మ పిల్లాడ్ని నేలపై దించింది.

అమ్మ ప్లేటులో వుప్మా వేసి ఆ పిల్లాడికి పెట్టింది. కడుగు పోసేసి నీలమ్మ వచ్చేలోపు

ఆపిల్లాడు వుప్మా వూర్చేశాడు.

నీలమ్మ పిల్లాడు తిన్న ప్లేటును కడిగి పెడుతూ ''వీళ్ళయ్య వీళ్లమ్మని తినేసినాడు. ఈడు నన్ను తినేస్తాడు. ఈడి ఆకలి మండిపోను ఆకలి! ఏడు కుండలు వండి వడ్డించినా తినేస్తాడు గదా, దెయ్యం తిండి ఎవడు పెడతాడు? ఈడమ్మ మొగుడు... ఆడు పెళ్లానికి మందు నీళ్ళు పొయ్యక, ఆకలితో ఇగిర్చి బలివిన సంపినాడ మరేటి...?'' గొంతు చించుకుంది.

''వాడ్నెందుకు తిడతావే...? చిన్న పిల్లడు... ఏమిటి తెలుస్తాది...? అవును గాని మీ అల్లుడికి తల పగలిందట, కుట్లు వేశారట... రైల్వే ఆసుపత్రిలో వున్నాడట.. ఒక దఫా చూసి రాలేక పోయావా?'' అమ్మ అడిగింది.

''నా కూతుర్ని ఆడు సంపినప్పుడే ఆడు సచ్చాడనుకున్నాను... ఇప్పుడాడు బలికితేటి? బుగ్గయిపోతేటి?''... నీలమ్మముఖం కందగడ్డలా వుంది. మాసిన బట్టతో పిల్లాడి మూతి తుడిసింది.

''అలగంటె ఎలగవుద్ది నీలమ్మ? ఎంత కాదనుకున్నా వాడు నీఅల్లుడు. అన్ని మాటలెందుగాన్ని నువ్విప్పుడు ఎవుల రక్తపు ముద్దని... కండని కొండ చేద్దామని అనుకుంటున్నావ్? ఈ పఁరాకులన్నీ (పాట్లు) పడుతున్నావు?'' అమ్మ సూటిగా అడిగింది.

నీలమ్మ రెండు నిమిషాలు ఏమీ మాట్లాడలేక పోయింది. తరువాత అంది. ''అందరూ నన్నే తప్పు పట్టండమ్మ... ఈ భూమ్మీద నా పాపమే ఎక్కువయి పోనాది. ఒక్క కూతుర్ని... నా కూతుర్ని నిలుపుకోలేక పోన్ను... నా కూతురు కాడికి నేనెప్పుడెల్తానో నా బాధలెప్పుడు ఈడేరుతాయో?''

నీలమ్మ ఏడ్చుకొని, పైట నోట్లో పెట్టుకొని పిల్లాడ్ని చంకలో వేసుకొని వెళ్లిపోయింది.

ఆమె వెళ్లాక చాలాసేపు నిశ్శబ్దాన్ని భరించాం.

తరువాత నేనే అమ్మ నడిగాను.

''అమ్మా.... పిండొడిం తన పెళ్లాన్ని చంపేసాడా?''

''అని లోకం అంటుంది. వాడి అత్త నీలమ్మ అంటుంది. పిండొడిం పెళ్లాం ఎర్ని పెళ్ళయిన పదిహేనేళ్లకి పిల్లడ్ని కంది. పురిట్లోనే దానికి పచ్చ కామెర్లు వచ్చాయి. దిసా (అశ్రద్ధ) చేస్సారు. ముదిరిపోయింది. ఆస్పెట్లకి తిప్పడానికి డబ్బుల్లేవన్నాడు పిండొడిం. అలాటోడివి ఎలా మనువు చేసుకున్నావు? దాని పీక పిసికి సంపే అంది నీలమ్మ, అసలు ఇలాంటివే వచ్చి పెళ్ళయినా చానాళ్ళు వరకు కూతుర్ని కాపురానికి పంపలేదు నీలమ్మ. పిల్లడు పుట్టిన తరువాత కష్టాలు ఆ గుంటడితోటి!...

''డబ్బులిస్తే తీసికెళ్తావా ఆస్పెట్లకి? నా దగ్గర డబ్బులూ లేవు నీవు ఆస్పెట్లకి తీసుకెళ్లా వద్దా...' అంది ఎర్ని. అప్పటికీ పిండొడిం పెళ్ళాన్ని ఆస్పెట్లకి తిప్పాడు.

అప్పటికే ముదిరి పోయిందన్నారు డాక్టర్లు. వేళ్ళు, గోళ్ళు, ఒళ్ళు అంతా పసుపుగా అయిపోయింది. అక్కడికి వారం రోజుల్లో కళ్లు తేలేసేసింది... కూతురు పోయాక దాన్ని బుగ్గి చేస్తే ఆ బుగ్గి (బూడిద) తెచ్చి పిండొడిం తల మీద వంపింది నీలమ్మ. మనవడ్ని తనతో తీసుకొచ్చినా అల్లుడ్ని ఇంటికి రానిచ్చింది కాదు. వెళ్ళినా పిల్లాడ్ని ముట్టనిచ్చింది కాదు. గతి మాల్నోడితో గండమని దూరంగానే వుంచింది నీలమ్మ. అప్పటి నుంచి పిండొడింకి ప్లాటు ఫారమే ఇల్లూ, వాకిలీ, తల్లీ అయింది!''

అమ్మ అన్ని విషయాలు చెప్పాక అసంతృప్తి ఎక్కువయింది. ఇంకేమీ అమ్మని ప్రశ్నించలేదు.

ఆ మధ్యాహ్నం నాన్న వచ్చి భోజనాల సమయంలో పిండొడిం విష యం కదిపారు. నీలమ్మ ఆస్పెట్లుకి వెళ్లిందట. కొడుకు చేత తండ్రికి ముద్దులు పెట్టించిందట. డికాషనులో రైల్వే రొట్టె (కటింగు రొట్టె) ముంచి తినిపించిందట. ఈ రోజు సాయంత్రం డిశ్చార్జి చేస్తే తన ఇంటికి తీసుకెళ్తుందట.

నాకు చాలా ఆనందం కలిగింది. పిండొడిం బాధలన్నీ తీరిపోయినట్లు అనిపించింది. అసంతృప్తి భారం తగ్గుతున్నట్లుగా తోచింది.

ఆ మరుసటి రోజునే విశాఖపట్నం బయలు దేరాను. బయలుదేరే ముందు పిండొడింను చూశాను. ఎప్పటిలాగే వున్నాడు. రెస్టు తీసుకోమన్నాను. డబ్బులు ఇద్దామనుకున్నాను. ఛార్జీలు, ఖర్చులు పిల్లలతో అని గుర్తొచ్చి ఆగిపోయాను. పిండొడిం మాత్రం వచ్చే ముందు నాచేతులు రెండూ ఓసారి పట్టుకున్నప్పుడు నావళ్ళు ఎందుకో జలదరించింది.

విశాఖపట్నం వచ్చేసిన వారం పదిరోజుల దాకా పిండొడిం గుర్తుకు వచ్చినా క్రమేపి కనుమరుగయ్యాడు.

నే కాంపిటేటివ్‌కు ప్రిపేరు అవుతూ జీవితంలో నిలదొక్కు కోవాలనుకున్నా ఈ చదువులు, పోటీ, కుస్తీ, అంతా కూడా జీవితం లోంచి పారిపోవడానికేమో అని తోచేది. లేకపోతే మళ్లీ నాలుగు నెలలకు ఊరు వెళ్లేదాక అమ్మ, నాన్న, పిండొడిం గుర్తురాక పోవడమేమిటి?

స్టేషన్‌లో దిగుతూనే వెతికాను!

నా కోసం వెతుక్కుంటూ రావలసిన 'పిండొడిం' కోసం నే వెతికాను!

ఎందరెందరో వచ్చారు.

పిండొడిం మాత్రం రాలేదు!?

కనిపించిన వారినల్లా అడిగాను.

తెలీదన్నారు.

చచ్చిపోయాడన్నారు.

అమ్మ చెప్పింది పిండొడిం చచ్చిపోయాడని! తలంతా చీముపట్టి, పురుగు పట్టి,

వుండయిపోయి కుళ్లు కంపుతో... ఈదేశంలోని దుర్గంధం అంతా తలపైనే వున్నట్టు... తనే మోస్తున్నట్టు... మోయలేక వెళ్ళిపోయినట్టు!!

పిండొాడిం తలకి కుట్లు పడ్డాక, డిశ్చార్జి అయినాక నీలమ్మ తనింటికి తీసుకువెళ్లిందట. వున్నదాంట్లో... తను తిన్నదాంట్లో, కలో గెంజో పెట్టిందట. కుట్లు విప్పే సరికి కొంచెం తడివున్నా ఆరిపోయిందని ఆత్మ తృప్తితో సరిపెట్టుకున్నాడట పిండొాడిం. 'ఆడదానివి నువ్వేం కష్టపడతావ్, ఎన్నాళ్ళు పోషిస్తావని' ఆ తలమీదే మూటలు, డబ్బాలు, పెట్టెలు... మోసాడట. సాహసించినా తలనీరు పట్టి వుండు పెరిగిపోయి... మరో నెలకల్లా మనిషే మట్టయిపోయాడట.

అమ్మ చెప్తుంటే నా కళ్లంట నీళ్ళు తిరిగాయి.

'పనిలో కెళ్లకపోతే పొట్ట గడవదు... ఎవరో ఒక పూటకి జాలిగ, దయగా పెడతారు. రోజుకి ఎన్నిపూటలు? ఎన్ని రోజులని...? ఒకరి కష్టం తినకుండా వెళ్లిపోయిన పిండొాడిం ఇతరుల కోసం కష్టపడ్డాడు. కాపురాల్ని నిలబెట్టాడు. పిండొాడిం నిజంగా పిండొాడివే! ఎవరో ముద్ద మీద తను ముక్కలయ్యాడు. పొడయి రాలాడు. కూరయ్యాడు. పిండొాడిం పిండొాడిమే!

నే మళ్ళీ విశాఖపట్నం బయలుదేరాను. స్టేషన్లో అలవాటుగా అప్రయత్నంగా నా కళ్ళు పిండొాడిం కోసం వెతికాయి. పిండొాడిం కనపడలేదు. కానీ నీలమ్మ కనిపించింది. స్టేషన్, ప్లాట్‌ఫారమ్ వూడ్చుతోంది. దాని మనమడు - పిండొాడిం కొడుకు చిన్న చెంబుతో నీళ్లు మోస్తున్నాడు. కునికేసిన తోటకూర కాడలా వున్న వాడి వయస్సు పదిహేనేళ్లంటే నమ్మలేనట్టుగా వున్నాడు.

నే అలా చూస్తూనే వున్నాను.

పిండొాడిం కొడుకూ పెద్దవాడయ్యాడు. పిండొాడిం అంత అయ్యాడు. పిండొాడిం లానే మూటలు మోస్తున్నాడు.. అదే నిక్కరు,అదే చొక్కా, అదే జుట్టు... అదే గూని!

ఉలిక్కి పడ్డాను. రైలు మోతతో బోగీలోకి నడిచి సీట్లో కూర్చున్నాను. నేను సేఫ్టీగా వున్నాను. మానాన్నకీ రిటైరుమెంట్ సొమ్ము లక్షా... లక్షన్నర వస్తుంది. అన్నయ్య బ్యాంకు మేనేజర్, తమ్ముడు డాక్టర్, ఇంకోడు చదువుతున్నాడు. నాకూ రేపు ఉద్యోగం వస్తుంది. అవసరమయితే పిండొాడిం కొడుకూ సాయపడతాడు. సీటు మెత్తగా వుంది. గాలి చల్లగా వుంది. నాకు భవిష్యత్తూ వుంది.

పిండొాడిం కొడుకు నెత్తిమీద ఏదో బరువు మూటా వుంది.

ఇప్పుడు రైలు ప్లాట్‌ఫారమ్ విడిచిపెట్టేలా వుంది.

*ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక । ౨౦౦౩ (దీపావళి ప్రత్యేక సంచిక)*